
# నాన్నగారు



**'జనరల్ న్యూస్ రూమ్‌లో జయచంద్రను కలవాలి'**

ఉలెన్ స్వెట్టర్‌తో, ఓవర్‌కోట్‌తో, ఉన్ని కేప్‌తో, షూజ్‌తో గేట్ దగ్గర నుంచున్న వాచ్‌మన్ ఆ వచ్చిన పెద్దమనిషిని చూసి ముందు నమస్కారం చేశాడు. ఘోరమైన ఆ ఢిల్లీ చలిలో ఆ పెద్దమనిషి పాదాలకు చెప్పులు లేకుండా మామూలు నూలు గుడ్డలతో రావటం మానవ మాత్రులకు సాధ్యం కాదనిపించింది. నెరిసిన గడ్డంతో వీపు మీదికి పడుతున్న జుత్తుతో ఆ వచ్చిన పెద్దమనిషి వాచ్‌మన్ మనోభావాలకు మహా పురుషుడు అనిపించింది.

వేకువ జాము పార్లమెంట్ స్ట్రీట్‌లో ఉన్న ఆకాశవాణి కేంద్రమైన బ్రాడ్ కాస్టింగ్ హౌజ్‌లో మార్నింగ్ షిఫ్ట్ సందడి మొదలయింది. న్యూస్ సర్వీస్ డివిజన్ సిబ్బందినీ, ఆకాశవాణి ఢిల్లీ కేంద్రం సిబ్బందినీ తెచ్చే వాహనాల రాకపోకలు సాగుతున్నాయి.

తనతో రమ్మని చెప్పి లోపలికి నడిచాడు వాచ్‌మన్.

ఆ వాచ్‌మన్‌కి అక్కడ సిబ్బంది ముఖాలు గుర్తే తప్ప పేర్లు తెలీవు. జయచంద్ర ఎవరో తెలీదు. జనరల్ న్యూస్ రూంలో కనిపించిన ఒక పెద్దవయసామెకో జయచంద్ర కోసం వచ్చిన ఆ సాధువును పరిచయం చేసి వెళ్ళిపోయాడు వాచ్‌మన్.

ఆ వచ్చిన వృద్ధుని ముఖంలో చెప్పరాని ఆ వింత అందం, నిరాడంబరం, ప్రపంచాన్ని మరచిపోయిన వైరాగ్యం చూస్తో ఆమె కొంతసేపు నోటమాట రాక నుంచుండిపోయింది. భక్తిముంచుకొచ్చి అప్రయత్నంగా చేతులు జోడించింది. ఆమె చూపులు అతడి పాదాలను తాకాయి.



"జయచంద్ర" అన్నాడు కృష్ణమూర్తి.

ఆ మాట తర్వాత ఆమెకి చలనం వచ్చింది. తెల్లగుడ్డలతో నెరిసిన జుత్తుతో వచ్చిన ఆ పెద్దమనిషిని చూసినప్పుడు తనలో వింత ఆనందం, ఆవేశం, భక్తిభావం చెలరేగి మనసు స్వాధీనం తప్పడం ఆమెకే విచిత్రం అన్పించసాగింది. లోపల కూర్చుని పనిచేసుకుంటున్న జయచంద్రను పిలుచుకుని వచ్చింది.

వాచ్‌మన్ ప్రేమాభిమానాలు, నెమ్మది కృష్ణమూర్తికి ఎంతో నచ్చాయి. ఎప్పుడు జయచంద్ర కోసం అక్కడకు వచ్చినా అతడిని కలుసుకోవటానికి ఏ ఇబ్బందీ ఉండదు. డ్యూటీలు తెలియకుండా వచ్చినా సరే ఉదయంపూట జయచంద్ర అక్కడ తప్పని సరిగా దొరుకుతాడు.

శ్రీపతి

ఎడం చేతిలో రెండు టైప్ కాగితాలతో కుడిచేతిలో బాల్ పెన్‌తో తలుపు తెరచి బయటకు వచ్చిన జయచంద్ర కారిడార్‌లో పరధ్యానంగా నుంచున్న కృష్ణమూర్తిని చూసి "నాన్నగారూ!" అని సంతోష పడిపోయాడు. కృష్ణమూర్తిని లోపలకు తీసుకుపోయాడు. లోపల వెచ్చగా ఉంది. నాలుగయిదు టైప్‌రైటర్‌ల మీద పని సాగుతోంది. ఎడిటర్ ఇన్ ఛార్జ్ టేబిల్ దగ్గర స్టెనో దూరప్రాంతల సమాచారాన్ని టెలిఫోన్‌లో అందుకుంటున్నాడు. ఓ గోడప్రక్క టెలిప్రింటర్‌లో అవిరామంగా మోగుతున్నాయి. ఇద్దరు ముగ్గురు అసిస్టెంట్ ఎడిటర్‌లు హడావిడిగా తిరుగుతున్నారు.

"కొంచెంసేపు ఇట్లా కూచోండి నాన్నగారు" అతను ఓ కుర్చీని తన టేబిల్ దగ్గరకు తెచ్చిపెట్టి "బులిటిన్ పని, ఆలస్యం జరిగితే న్యూస్ రీడర్ వచ్చిపడేట్టున్నాడు" అని తనచేతిలోని కాగితాల వేపు దృష్టిమళ్ళించి టైపిస్టుకు స్టోరీ డిక్టేట్ చేయటాన్ని అందుకున్నాడు.

ఉలెన్ సూట్‌లు పనిలో మునిగి తేలుతున్నాయి. ఓవర్ కోట్‌లతో ఇద్దరు యువతులు చురుగ్గా టైప్ చేసుకుంటున్నారు. ఓ టేబిల్ దగ్గర ఓ యువకుడు కునికిపాట్లు పడుతున్నాడు. తనతో మాటాడి జయచంద్రను పిలుచుకువచ్చిన ఆ స్త్రీ దూరంగా ఓ టేబిల్ ముందు న్యూస్ పేపర్ చదువుతో కూచుని ఉంది. కృష్ణమూర్తి చూపు చుట్టూ తిరిగి జయచంద్ర మీద ఆగింది. గ్రే కలర్ ఉలెన్ సూట్‌లో, మెరుస్తోన్న బ్లాక్ షూజ్‌తో కొంతసేపు ధర్మానే చూసినట్టయింది కండ్లలో తళుక్కుమనే మంచితనం ఎదిగిన ప్రతిభాసంస్కారాలు, వారసత్వంగా తెచ్చుకున్న సహృదయం- అట్లా ఎన్నెన్ని అందాలుగానో కన్పిస్తాడు జయచంద్ర.

దేశ సంచారం చేస్తున్న తన పుత్రుడు ఇంటినించిపారిపోయి ఎనిమిదేళ్ళు నిండాయి. దగ్గర్లోనే దొరుకుతాడు. ఇంకెంతో కాలం పట్టదు కలుస్తాడు. అదే ఆశతో కృష్ణమూర్తి ఇప్పుడు జయచంద్ర దగ్గరకు వచ్చాడు.

జయచంద్ర ఓ కాగితాన్ని టైపిస్టుకు యిచ్చి "స్టోరీలో ఫస్ట్‌పేరా తీసుకోండి" అని ఎడిటర్ ఇన్ చార్జ్ దగ్గరకు వెళ్ళాడు. అకాలీ సమస్యకు సంబంధించిన వార్త. ప్రభుత్వం ప్రకటించిన ఉదార వైఖరిదృష్ట్యా సమస్య పరిష్కారానికి దోహదపడి రాష్ట్రంలో సుహృద్భావ వాతావరణం నెలకొల్పవలసిందని ప్రతిపక్షనాయకుల విజ్ఞప్తి. రాత్రి తొమ్మిదిగంటల ఇంగ్లీష్ బులిటిన్‌లో వెళ్ళిన ఐటమే అది. ఉదయం బులిటిన్‌కు ఆ వార్త పనికొస్తుందనుకున్నాడు జయచంద్ర. ఆ సంగతే మాటాడాలని అతడు ఎడిటర్ ఇన్ చార్జి దగ్గరకు వెళ్ళాడు.

ఆయనతో మాటాడి, తిరిగి తన టేబిల్ దగ్గరకు వచ్చి, టైపిస్టుకు ఇచ్చిన కాగితం తీసుకుని రివైజ్డ్ స్టోరీ వచ్చిందని వేరే పేజీ యిచ్చాడు జయచంద్ర. బులిటిన్‌కు సరిపడేంత మేటర్ దొరక్కపోయే సరికి ఇబ్బంది పడుతూ రాత్రి పూల్ తీసిచూట్టం తప్పనిసరయింది.

కృష్ణమూర్తి మౌనంగా కూచున్నాడు. రంగస్థలం ముందు కూచున్నట్టుంది. పాతకాలం గుర్తుకువస్తోంది. ఎందుకీ ఉద్యోగాలు చేయాలి- ఎక్కడినించో పొట్ట చేత్తోపట్టుకుని ఇంతదూరం వచ్చి, ఇక్కడ ఈ వేషమూ, భాషా, ఈ ఉద్యోగవిధులూ, పోటీ, తాపత్రయం, ఈ పరుగూ అంతా కొత్తగా వింతగా అగమ్యంగా ఉన్నాయి.

జయచంద్రను చూసినప్పుడల్లా ధర్మాను కలిసినట్టే ఉంటుంది. వెంటనే తననించి వాడిని ఎవరో ఎత్తుకుపోతున్నట్టు అన్పిస్తుంది. ఆ భావం ముంచుకొచ్చిందా ఇంక అక్కడ ఒక్క నిమిషంకూడా ఆగలేదు. అతడి జీవితంలో ఎందరో ప్రేమమూర్తులు అదృశ్యమైపోయారు. కృష్ణమూర్తి ఆరేళ్ళ వయసులో తల్లి అదృశ్యమైపోయింది. నలుగురామెను మంచపల్లకి పై మోసుకుపోయిన దృశ్యం గోడకి వేలాడేసిన పెయింటింగ్ మో స్తరుగా అతడి మనసుమీద ముద్రపడిపోయింది. డాక్టర్ ఇంజక్షన్, పడగ విప్పి కాటువేసి, తోకనేలకు కొట్టి పారిపోయిన పాము, బావిలో ఉబ్బిపోయిన మృతకళేబరం, శ్మశానంలో మంటలు, గడ్డకట్టుకుపోయిన ఈ దృశ్యాలు కన్నీళ్ళతో అలుక్కుపోయిన కాన్వాస్ దొంతర్లు.

దాంతో కృష్ణమూర్తి తనను విసిరేసుకున్నాడు ఈ ఉత్తుంగ హిమాలయాల వేపు. ఈసారి అతడు దాదాపు రెండేళ్ళు రిషీకేశ్ లోనే ఉండిపోయాడు. మధ్యమధ్య బెనారస్, అమర్నాథ్‌లో వెళ్ళటం రావటం మామూలే. రిషీకేశ్ బావుంటుంది. ఎప్పుడన్నా ధర్మా రిషీకేశ్‌లోనే తనను కలుసుకుంటాడని స్వామీ భగవాన్‌జీ చెప్పారు.

కృష్ణమూర్తి నిన్ననే ఢిల్లీ వచ్చాడు. జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ క్వార్టర్స్‌లో ఉంటున్న తన చిన్ననాటి స్నేహితునితో అర్ధరాత్రి దాకేవరకు, తప్పిపోయి హిమాలయాల్లో తిరుగుతున్న తన కొడుకు గురించి ముచ్చట్లు చెప్పి, స్నేహితుడు నిద్రపోయిన తర్వాత ఓ గంటసేపు మేనువాల్చి, లేచి, ఆ ఘోరమైన చలిలో చన్నీటి స్నానంచేసి కాలినడకను బయల్దేరాడు దాదాపు పదికిలో మీటర్ల దూరంలో ఉన్న ఆకాశవాణికి. అక్కడ జయచంద్రను చూడాలి. అక్కడే తెలుస్తుంది ధర్మాసంగతి.

నాటకం చూస్తున్నట్టుగా, తెరమీద బొమ్మలను చూస్తున్నట్టుగా ఉంది కృష్ణమూర్తికి అక్కడ. జయచంద్ర ఇప్పుడక్కడ ముఖ్యపాత్రధారి. మిగిలిన వాళ్ళంతా నిజంగానే బొమ్మలు. ప్రాణం ఉన్నబొమ్మలు ఏడ్చేనవ్వే బొమ్మలు.

"ఇంకో పదినిమిషాల్లో బులిటిన్‌పని ముగుస్తుంది నాన్నగారు. మనం మాటాడుకోవచ్చు. అసలు డ్యూటీ రేణుది. ఆమె రాలేదు. స్టాండ్‌బై డ్యూటీనాది. మిస్ రేణూ ముఖర్జీ మీకు గుర్తేకదా! క్రిందటిసారి వాళ్ళ ఇంటికి తీసుకుపోయిందే ఆ రేణు. రిషీకేశ్ వచ్చి ఫోటోలు తీసిన-"

జయచంద్ర మళ్ళీ తన డ్యూటీలో పడ్డాడు. రాత్రిపూల్ వెతికితేపనికివచ్చే నాలుగయిదు స్టోరీలు దొరికాయి. వాటిల్లో తేదీలు లాంటి చిన్న చిన్న మార్పులు చేసి, ఒకటిరెండు వాక్యాలను కుదించి సరిచేసి ఆ పేజీలను టైపిస్ట్ దాస్‌కు యిచ్చేశాడు. అంతలోనే ఎడిటర్ ఇన్ చార్జీ రెండుపేజీలు పంపించాడు. దాంతో బులిటిన్‌కు వార్తల కరువు తీరింది. పూల్‌కాపీలనే యూనిట్స్‌కి పంపించేసి ఊపిరి పీల్చుకున్నాడు జయచంద్ర.

కృష్ణమూర్తిని కండ్లారా జయచంద్ర చూసిందికూడా అప్పుడే. క్షణంలోనే జయచంద్ర కండ్లలోంచి జరజరా కన్నీళ్ళు

రాలిపడ్డాయి. దుఃఖాన్ని దిగమింగుకునేందుకు ముఖాన్ని పక్కకు తిప్పుకున్నాడు. దుఃఖంతో తను కూలిపోతున్నాడు. భౌతిక దేహాన్ని మృత్యువు మింగేస్తున్నట్టుంది మనసు చివికిపోయింది.

త్రిపిస్ట్‌దాస్ పిలుపు ఆ సమయంలో ఊపిరి పోసినంత మేలుచేసింది. హెడ్‌లైన్స్ పేజీ పని మొదలయింది.

శరీరం మీద కేవలం తెల్లటి నూలులాల్చీ, ధోతీతో ఉన్న కృష్ణమూర్తి జనరల్ న్యూస్ రూమ్‌లో అందరిదృష్టినీ ఆకర్షించటం జయచంద్ర కళ్ళల్లో పడింది. పశువుల ప్రాణాలను బలిగొంటున్న విపరీతమైన ఆ చలిలో ఈ పెద్దమనిషి వేసవి గుడ్డల్లో కనిపించడం విడ్డూరం అనిపించి చూసినవాళ్ళు ఆ ముఖంలోని తేజస్సుతో సమ్మోహితులవుతున్నారు. ఇద్దరు ముగ్గురు కృష్ణమూర్తి దగ్గరకు వచ్చి నమస్కారం చేసి వెళ్ళారు.

బీహార్, ఉత్తరప్రదేశ్‌లలో చలిమూలంగా ఇరవైమంది చనిపోయారు. ఫోర్త్ హెడ్‌లైన్‌గా ఈ వాక్యం చెబుతున్నప్పుడు డ్యూటీలో ఉన్న డెప్యూటీ డైరెక్టర్ అటువేపు వచ్చి స్టీల్‌ప్లాంట్ రికార్డు స్థాయి ఉత్పత్తికి సంబంధించిన వార్త ఫోర్త్ హెడ్‌లైన్ చేస్తే బావుంటుందని సలహా చెప్పాడు. మానవతా ఇతి వృత్తానికి ఇవ్వాల్సిన ప్రాముఖ్యం పోయి, ప్రభుత్వ అభివృద్ధి పథకాలకు ప్రాధాన్యం ఇవ్వటం ఆ సలహా వెనక ఉద్దేశం. జయచంద్రకు నచ్చలేదు. చలికి ఇరవైమంది చనిపోయిన సత్యం మరుగున పడేసే ప్రయత్నం. జయచంద్ర ఒప్పుకోలేదు. స్టీల్‌ప్లాంట్ రికార్డు స్థాయి ఉత్పత్తిని అయిదో హెడ్‌లైన్ చేయొచ్చని జయచంద్ర చెప్పిన తర్వాత డి డి ఎన్ వెళ్ళిపోయాడు.

మిస్ రేణూ ముఖర్జీ వచ్చింది. ట్రాన్స్‌పోర్ట్ సెక్షన్‌లో రిక్విజిషన్ ఇవ్వటం మరచిపోయినందువల్ల తనకు వెహికిల్ రాలేదట. ఆ సంగతి ఆమెకు గుర్తొచ్చి టాక్సీకి ఫోన్‌చేసి వచ్చే సరికి ఈ ఆలస్యం.




ఇది మామూలే. ఎవరు ఉన్నా లేకున్నా పని సాగిపోయే యంత్రాంగం. ఎవరు పనిచేసినా పనిచేయకున్నా పట్టించుకోని పని తీరుతెన్నులు. హక్కులనీ, విధులనీ కలగా పులగం చేయగల అంచెలంచెల అధికారాల ప్రభుత్వ యాజమాన్యం. ఎవరు దేనికీ బాధ్యత తీసుకోలేని అయోమయ వ్యవస్థ. దాంతో జయచంద్రకు కొత్తగా ఏ ఇబ్బందీ అన్పించలేదు. చేతిలో పని లేకుండా సోమరిపోతుగా ఉండాలంటేనే అతడికి తలనొప్పి పైగా రేణూ ముఖర్జీ అంటే ఇష్టం, చనువు. ఆ భరోసాతోనే ఆమె ఆలస్యంగా వచ్చినందుకు ఏ సంజాయిషీ చెప్పుకోలేదు. ఇట్లాంటి అవాంతరం ఏదో వస్తే తప్ప ఆమె పంచుయాలిటీ భంగంకాదు. పోతే ఇప్పుడు ఆమె రావటం జయచంద్రకు ఎంతో సంతోషంగా ఉంది. బులిటిన్‌పని దాదాపు పూర్తి కావచ్చింది. ఇంక ఆ పనిని ఆమెకు అప్పజెప్పేసి నాన్నగారుతో తాను కూచోవచ్చు మాటాడు కోవచ్చు. అట్లా కేంటిన్ వేపు పోవాలనుకున్నాడు జయచంద్ర.

మిస్ రేణూ ముఖర్జీ, అక్కడ కూచున్న కృష్ణమూర్తిని చూసి ఎగిరి గంతేసినంత ఉప్పొంగిపోయింది. 'నాన్నగారూ' అని వొంగి కృష్ణమూర్తి పాదాలను ప్రేమతో తాకి కళ్ళకు అద్దుకుంది. జయచంద్ర ఆమెకు నేర్పిన తెలుగు మాటల్లో 'నాన్నగారు ఒకటి 'బాగున్నారా' అనికూడా తెలుగులోనే అడిగింది.

జయచంద్ర కోసం గత ఏడాది ఓ వేకువజామున వర్షంలో తడిసి వచ్చినప్పుడు తొలిసారి కృష్ణమూర్తితో ఆమెకు పరిచయం.

ధర్మారావు, జయచంద్ర పదేళ్ళక్రితం యూనివర్సిటీ మిత్రులట. దాదాపు ఎనిమిదేళ్ళ కిందట ధర్మారావు వరసగా నాలుగు రోజులు కన్పించలేదట. ధర్మారావు ఎక్కడికో పనిమీద వెళ్ళి ఉండొచ్చు అనుకున్నారట. అయినా వెతికే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ధర్మారావుకు స్నేహితులతో ముడి. స్నేహితులంటే ప్రాణం. దాంతో ధర్మారావును వెతికిపట్టుకునే బాధ్యతతో కృష్ణమూర్తి వివిధ పట్టణాలు తిరగవలసి వచ్చింది బంధువులకు, ఇంకా తెలిసినవాళ్ళకి పాతకాలం స్నేహితులకు ఉత్తరాలు రాశారట కృష్ణమూర్తి తెలిసిన వాళ్ళందరి ఇండ్లకిపోయి భోగట్టా చేశాడు. పత్రికల్లో స్నేహితులు ప్రకటనవేశారు. జాతకచక్రం తిరగవేస్తే సరిగ్గా ఈ వయసులో పెద్దప్రమాదం ఉందని ఒక సిద్ధాంతిగారు చెప్పారు. మరికొందరు జ్యోతిషకారులు ఉత్తరదిక్కున కొంత ప్రాంతాలలో సాధువుగా తిరుగుతున్నారన్నారు. ఓ కొండదొర "ప్రపంచంలో కలిసిపోయినాడని చెప్పితిని కదా" అన్నాడు. దాని అర్థం ఏమిటో వివరించి చెప్పమంటే ఆ కొండదొర "దాని అర్థం తర్వాత తెలుస్తుందిలే" అని చెప్పాడు. ఆ రోజుల్లోనే కృష్ణమూర్తికి ఒక మహా పండితుడు పరిచయమయ్యాడు. ఆయన చెప్పిందేమంటే "బతికే ఉన్నాడని అయితే ఈ బాహ్యప్రపంచ దృష్టిలో లేడని ఈశ్వర అన్వేషణలో తాదాత్మ్యం చెందాడని" మొదటినించి ధర్మాకి దైవభక్తి అధికం వాడు ఈశ్వరాన్వేషణలోనే హిమాలయ పర్వత ప్రాంతాలలో తిరుగుతో ఉంటాడని అతడిగట్టి నమ్మకం. ఓ సారి తనతో మాటల్లో ఇట్లాంటి అభిప్రాయాన్ని ధర్మావ్యక్తం చేశాడని కృష్ణమూర్తి చెబుతాడు. హిమాలయాలలో తిరుగుతున్నట్టు అతడికి చాలసార్లు స్వప్నాలలో ధర్మాకనిపించాట్ట. ఎక్కడున్నావ్

చెప్పు అని స్వప్నంలోనే తండ్రి గట్టిగా అడిగితే నోరు విప్పలేదట చెప్పలేదట. అప్పటికే ఉద్యోగంనించి రిటైరయిన కృష్ణమూర్తి ఇల్లూ, ఆస్తి దగ్గరవాళ్ళకు వదిలేసి కొడుకుని వెతికి పట్టుకోవాలని హిమాలయాలకు వచ్చేసి ఈపర్వత ప్రాంతాల్లోనే తిరుగుతున్నాడు.

ధర్మా ఇంటినించి తప్పిపోయిన నాలుగైదు రోజుల్లోనే వాళ్ళ ఇంటికి సమీపంలోనే ఓ పాడుపడిన బావిలో ఒక యువకుని మృతదేహం ఉబ్బిపోయి దొరికినప్పుడు అది ధర్మారావే అన్నందుకు కృష్ణమూర్తికి కోపమొచ్చింది. ఆ రాత్రి రెండో ఆట సినిమాకు వెళ్ళినప్పుడు ధర్మా తెల్లటి ఉలెన్ స్వెట్టర్ "డార్క్ బ్లూ షర్ట్ వేసుకున్నాడని, అవి లేవు కనక ఆ మృతదేహం ధర్మారావు కాదని చెప్పినా వినక తన దగ్గర బంధువులే దానికి దహన సంస్కారం చేశారు. ఆ రకంగా తన శత్రువులు తనపై పగతీర్చుకున్నారంటాడు కృష్ణమూర్తి. ఆ దుఃఖంతో కుమిలిపోయి, ధర్మాను పట్టుకుని ఇంటికి తెచ్చివాడు బతికే ఉన్నాడని రుజువు చేయాలని కూడా మొదట్లో అతడికి పట్టుదల కలిగింది.

మిస్ రేణూ ముఖర్జీ జయచంద్ర నోట ఈ కథ విన్నప్పుడు విలవిల్లాడి పోయింది. ఏళ్ళింది పితృహృదయం మహా సౌంధర్యంతో ప్రకాశించాడు కృష్ణమూర్తి. జయచంద్ర మొస్తరుగానే నాన్నగారూ అనిపిలిచింది. అది మొదలు మిస్ ముఖర్జీకి కృష్ణమూర్తి పట్ల ఆరాధనభావం పెరగటం. కృష్ణమూర్తిలాంటి తండ్రులు కొందరు ఉన్నందువల్లనే మానవత్వం ఈ ప్రపంచంలో మనుగడ సాగిస్తోందని ఆమెకు అన్పించింది. కృష్ణమూర్తిని చూస్తే చాలు చల్లగాలికి ఆడుకునే పూలమొక్కలా అయిపోతుంది. విహంగమై మనసు రెక్కలు చాచి గగనతలానికి ఎగిరిపోతుంది. వెచ్చని కాంతిలో స్నానం చేసినట్టు - సాకృతికమైన పరమానందం ఆవేశించినట్టు, తన వాతావరణం పరిమళాలతో నిండిపోయినట్టు, కొత్త అందాలు ఆమెకండ్లకు కనిపించి తాదాత్మ్యం పొందుతుంది.

ఎడిటర్ ఇన్ చార్జి సీట్‌లో కూచున్న ఓ యువకుడు కృష్ణమూర్తిని చూశాడు. దృష్టి అక్కడే కొంతసేపు నిలచిపోయింది. తనకు ప్రాణప్రదమైన మనుషుల్ని, ఆప్తుల్ని అక్కడ చూస్తున్నట్టుంది. తను చదివిన కావ్యాలలోని ఋషుల రూపాలు అతడిలో కన్పిస్తున్నాయి. రామకృష్ణ పరమహంస గురువు త్రైలింగస్వామి గుర్తుకొచ్చాడు. ఒక మహాద్భుతమైన అందం ఆ ముఖంలో, ఒకసారి ఆ చూపు తనను స్పర్శించితే ఎంత బావుండును అనుకున్నాడు. తన మీద అతడి చూపు పడాలన్నిలేచి కృష్ణమూర్తి కూచున్న చోటుకు వచ్చికూచున్నాడు. కృష్ణమూర్తి చిరునవ్వుతో అతడి ప్రేమను స్వీకరించడంతో అతడికి దివ్యానుభూతి లాంటి గొప్ప సంతోషం కలిగింది.

ఎడిటర్ ఇన్ చార్జి తన సీట్ దగ్గరకి వస్తుంటే ఏదో చెప్పటానికి వచ్చాడనుకుని రేణూ ముఖర్జీ అతడిని చూసింది. నాన్నగారుని చూసి అతడు పరధ్యానంగా, వచ్చిన పని మరచి వెళ్ళిపోయాడేమో అనుకుంది.

ఆ బులిటిన్ తర్వాత ఆమెకు పావుగంటసేపు విరామం. ఆ సమయంలో సామాన్యంగా డ్యూటీలో ఉన్నమిగిలిన సిబ్బందితో కేంటీన్‌కు వెళ్ళిచాయి తాగివస్తుంది. బులిటిన్ పని మిస్ ముఖర్జీ ఆడుతూ పాడుతూ చేసుకోగలదు. అక్కడున్న చాలమందికి జర్నలిజం ఉద్యోగం కాగా మిస్ ముఖర్జీకి అది పుటకతో అబ్బిన విద్య. ఆమె రాజకీయాలలో పుట్టి పెరిగింది. సుభాష్ చంద్ర బోస్ అనుచరుడైన ఆమె తండ్రి స్వాతంత్ర్య యోధుడు ఎందరో ప్రముఖ రాజకీయవేత్తలు. అడుగుపెట్టిన ఇల్లామెది. ఆమెది జర్నలిస్టుల కుటుంబం. ఆమె పెద్దన్నయ్య చిన్న వయసులోనే ఓ ప్రముఖ ఇంగ్లీషు దిన పత్రికకు సంపాదకుడై పత్రికారంగంలో సంచలనం సృష్టించాడు. ఉన్నత నైతిక ప్రమాణాలకు దోహదపడి ప్రముఖుల మన్ననలను పాఠకుల అభిమానాన్ని పొందాడు. ఆమె చిన్నన్న మరొక ప్రముఖ ఇంగ్లీషు దిన పత్రిక వాషింగ్టన్ కరెస్పాండెంట్‌గా ఉంటున్నాడు. ఆమె బంధువులు చాలమంది రకరకాల పత్రికల్లో మంచి మంచి పదవుల్లో ఉన్నవాళ్ళే.

మిస్ ముఖర్జీ డ్యూటీ అంటే దాస్‌కు సంతోషం. బెంగాలీలో ముచ్చట్లు చెప్పుకుంటూ పనిచేసుకోవచ్చు. జయచంద్రతో అట్లా కుదరదు. పనిలో మునిగిపోతాడు. చేతిలో పని ఉంటే వేరేధ్యాస ఉండదు. కొందరు అసిస్టెంట్ ఎడిటర్‌లకు చేయటానికి ఏ పనీ దొరకదు. జయచంద్రకు మాత్రం చేతినిండా ఎప్పుడూ పని

---

ఆటంబాంబు తయారుచేయటంలో ముఖ్యుడయిన రాబర్ట్ ఆపన్ హీమర్‌ను ఇంత భయంకరమయిన బాంబును కనుగొన్నారు కదా దీని బారి నుండి రక్షించుకోవటానికి మరో సురక్షితమైన ఆయుధం ఏమయినా ఉందా?" అనడిగాడు ఓ విలేఖరి.

"ఉంది ఎందుకులేదూ ?" అన్నా ఆపన్ హీమర్ నవ్వుతూ.

"ఏమిటది ?"

"శాంతి" అన్నారాయన సీరియస్‌గా.

---



ఉంటుంది. డ్యూటీకి వస్తే తీరికే చిక్కదు. పైగా ఇతర్ల పనులని నెత్తిమీద వేసుకునే తత్వం.

బ్రైపిస్ట్ దాస్ హెడ్‌లైన్స్ పూర్తిచేసి, ఆర్డర్ కూడా అయిన తర్వాత బులిటిన్‌ని చూసుకోమని మిస్ ఉషా ముఖర్జీ చేతిలో పెట్టాడు జయచంద్ర.

ఆమె బులిటిన్ చూసుకుని సరే అనే వరకు అక్కడే ఉండి ఓ సారి ఎడిటర్ ఇన్ చార్జ్ దగ్గరకు వెళ్ళి రేణు ముఖర్జీ వచ్చినట్టు, బులిటిన్ చూస్తున్నట్టు చెప్పేసి కృష్ణమూర్తిని తీసుకుని జయచంద్ర కేంటీన్ వేపు నడిచాడు.

జయచంద్ర మోస్తరుగానే ధర్మా ఇలాంటి ఉద్యోగంలోనే ఉండేవాడు. వాడికి లెక్చరర్ ఉద్యోగం ఇష్టం. జయచంద్ర లాగానే మనిషి నిండుకుండలాగ ఉండేవాడు. ఒకంతట దేనికీ తయపడే వాడుకాదు. వాడికి ఏం కావాలో తను చెయ్యాలే తప్ప వాడు నోరువిప్పి ఇది కావాలి అని ఎప్పుడూ అడిగేవాడుకాదు.

కేంటీన్ నిండా ఉదయం డ్యూటీ సిబ్బంది. ఓ టేబిల్ దగ్గర టీ తాగుతూ తెలుగు న్యూస్‌రీడర్లు కనిపించి జయచంద్రను చూసిబావున్నారా అని పలకరించుకున్నారు.

కృష్ణమూర్తిని వేరేటేబిల్ దగ్గర కూచోబెట్టి తను టీ తీసుకుని రావటానికి వెళ్ళాడు.

రెండు కప్పులతో తిరిగి వచ్చాడు జయచంద్ర. "ఈ ఆకాశవాణిలో పనిచేస్తున్న వందలాదిమంది సిబ్బందిలో ఎవరి రుచిని బట్టి వారికి టీ చేసిపెడతాడు మా పండిట్ జీ. మనం వెడితే ఓ సారి మనముఖం చూస్తాడు అంతే. మన ఇష్టం తెలిసిపోతుంది. ఈ ఆకాశవాణిలో అతడో కర్మవీరుడు" అని పండిట్‌జీ గురించి తన ప్రేమాభిమానాలు ప్రకటించుకున్నాడు.

అంత వరకు కృష్ణమూర్తి నోరు విప్పనేలేదు. అన్నీ వింటున్నాడు. అమ్మాయి రేణు, అబ్బాయి జయచంద్ర ప్రేమాభిమానాలు ఈ లౌకిక ప్రపంచంలో కృష్ణమూర్తికి తియ్యటి అనుభూతులను రుచి చూపుతున్నాయి. వాళ్ళిద్దరూ రెండు బొమ్మల్లాగ కనిపిస్తారు. వాళ్ళిద్దరు కూడా ఆయనకు రెండుమూడేళ్ళ పసిపిల్లల్లా అనిపిస్తారు.

"అబ్బాయ్, ధర్మాగాని ఇటువేపునీ దగ్గరకు వచ్చాడా ?" అడిగాడు కృష్ణమూర్తి. ఆ పనిమీదే ఆయన ఈ సారి ఇక్కడికి వచ్చినట్టుంది.

ధర్మారావు రాలేదని చెప్పేట్టయితే కృష్ణమూర్తి తట్టుకోలేడు అతడు బాధపడకుండా ఎట్లా చెప్పాలో తోచక, కృష్ణమూర్తి ముఖంలోకి చూడలేక తడబడుతున్నాడు జయచంద్ర.

"వచ్చినా కలవడులే నిన్ను నువ్వు ఇక్కడున్నట్టు తెలిస్తే ఇదివరకే వచ్చి కలిసేవాడు కదా ! వాడికి నువ్వు ఇక్కడున్నట్టు తెలిసిందేమో, తెలిస్తే వచ్చి తప్పనిసరిగా కలుస్తాడులే అన్న ఆశతో వచ్చాను. మొన్న ఏమయిందో తెలుసా అబ్బాయ్, రిషికేశ్‌లో ఆంధ్రాశ్రమం దగ్గర ఓ తెలుగు సాధువుగారు కన్పించి, మీ అబ్బాయిలాంటి కుర్రాడినే చూశాను స్వామీ అన్నాడు. ఆ సాధువుగారు చెబుతున్నది నిజమోకాదో తేల్చుకుందామని ఎదురు ప్రశ్నలడిగాను. ఎట్లాంటి బట్టలు తొడుక్కున్నాడని అడిగాను. లాల్చీ పైజామా అన్నాడు. ఏ రంగువి అన్నాను. తెల్లరంగు అన్నాడు. అంతే దా అమ్మ ఎప్పుడూ తెల్లటి లాల్చీ పైజామానే


*With best compliments from :*

**KANTHI PRINTING INKS PRIVATE LIMITED**

ANJANEYA PANTHULU STREET, VIJAYAWADA - 520 010.

Phones : Fact : 74083 Off : 72060 Resi 77047

MANUFACTURERS OF :
Quality Printing Inks for Letter Press, Offest and Litho

DISTRIBUTORS FOR TWIN CITES

**SRI LAKSHMI ENTERPRISES**
Raj Bhavan Road, Hyderabad - 500 004.
Phone : 35842

కదా వేసుకునేది. పోతే పోలికలు చెప్పు అన్నాను. అన్నీ మీ పోలికలే స్వామీ విశాలమైన నుదురు పెద్దకళ్లు కొనదేలిన ముక్కు- అవును వాడివన్నీ నా పోలికలే. ఎక్కడ చూశావయ్యా స్వామీ అని అడిగాను. బస్‌స్టాండ్ దగ్గర చూశాడట. ఢిల్లీ వేపు వచ్చే బస్సు ఎక్కాడట. అంటే వాడు నీదగ్గరికే కదారావాలి" అని మరోగుక్కెడు తాగాడు కృష్ణమూర్తి.

విశ్వాంతరాళంలో దూరాన్ని కొలవటానికి కాంతి సంవత్సరాల కొలబద్ద ఉన్నట్టు మనిషి లోపల ఉన్న దుఃఖ సముద్రాలను చూపటానికి కన్నీటి బిందువులే మిగిలాయి. జయచంద్ర కండ్లలోంచి జలజలా రాలాయి ధారగా. చీకటిరాత్రి నదిలో పడిపోయిన బస్సు తల్లినీ అన్నయ్యనీ అతడి భవిష్యత్తునూ సముద్రంలో ముంచేసిన దుఃఖం ఉప్పొంగింది.

రెండు సముద్రాలు రెండు ముఖాలుగా రెండు ప్రతిమలయ్యాయి.

కృష్ణమూర్తి మరోగుక్కటి తాగి "చూశావా అబ్బాయ్. వాడునా చుట్టే తిరుగుతున్నాడు. ఏదో మాయ. మాయ మూలంగా ఒకరికి ఒకరం కనిపించటం లేదు. కలుసుకోలేక పోతున్నాం" అని శూన్యంలోకి చూశాడు.

అంతర్థానమైన తన కుమారుడు నడచిన అదృశ్యమార్గాలలో అందని అందాన్ని వెతుకుతున్నాయి ఆ చూపులు. హిమాలయ పర్వత సానువుల్లో, నదీతీరాల్లోని క్షేత్రాల పరిసరాల్లో, అరణ్యాల్లో లోయల్లో తండ్రి కోసం వెతుకుతున్న పుత్రుని కలుసుకోవటం కోసం కృష్ణమూర్తి బయల్దేరటానికి తయారయ్యాడు.

"వస్తాన్ అబ్బాయ్ కిందటిసారి మోస్తరుగా రావాలిసుమా" రిషికేశ్ రేణూను రమ్మన్నానని చెప్పు. తప్పనిసరిగా తీసుకురా అని చెప్పేసి ఆ చలికాలపు చీకట్లో బయటపడ్డాడు కృష్ణమూర్తి.

"కాదు నాన్నగారూ రేణూతో ఓసారి చెప్పివెళ్ళండి." అని జయచంద్ర ఎంత బతిమాలినా వినిపించుకోలేదు. కృష్ణమూర్తి వెనక్కి చూడలేదు.

రిషీకేశ్‌లో తనకోసం వచ్చి వెతుకుతున్న ధర్మా తను కనిపించకపోతే వెళ్ళిపోతాడేమోనన్న ఆందోళనతో నడచిపోతున్నాడు కృష్ణమూర్తి. గేట్ వరకు కృష్ణమూర్తి వెంటే వెళ్ళిన జయచంద్ర, విద్యుద్దీపాలు వెల్తురుకిందినించి, చెట్లనీడల్లోంచి, రంగులను మేసేసిన చీకట్లోంచి, ప్రవాహంలో కొట్టుకుపోయిన పువ్వులాగ, చూపు అందని మలుపుల్లో మాయమయ్యాడు.

° ° ° °

జయచంద్ర న్యూస్ రూమ్‌కి వెళ్ళేసరికి మిస్ ముఖర్జీ సీట్లో లేదు. గడియారం చూసి స్టూడియోలోకి వెళ్ళాడు. ఆమె స్టూడియోలో న్యూస్ రీడర్‌కు కరక్షన్ చెబుతోంది. పి. ఎమ్. స్టోరీని లీడ్ హెడ్‌లైన్ చేయమని డైరెక్టర్ చెప్పాడట. న్యూస్ రీడర్ స్టుడియోలోకి వెళ్ళిన తర్వాత ఎడిటర్ ఇన్ చార్జ్ వచ్చి చెబితేతాను వచ్చిందట.

న్యూస్ రూమ్‌కి వచ్చిన తర్వాత కృష్ణమూర్తి కన్పించక పోయేసరికి 'నాన్నగారు ఎక్కడ ?' అని అడిగింది. రేణూ ముఖర్జీ.

"వెళ్ళిపోయారు ఎంత బతిమాలినా ఆగలేదు" అని జయచంద్ర చెబుతుంటే మిస్ ముఖర్జీకి కోపమొచ్చింది. తర్వాత కన్నీళ్ళు ముంచుకొచ్చాయి తను ఉన్నట్టయితే నాన్నగారిని కదలనిచ్చేది కాదట. అడ్డంపడేదట. కావలిస్తే ఏడ్చినా అడుగు ముందుకు వేయనిచ్చేదికాదట.

జంపన శ్రీహరిరాజుకు స్నేహాభినందనతో


*With best compliments from*

# MS. BOMBAY MILL STORE,

*SHASTRI MARKET* ***JALANDHAR***